ముగిసిన చాముండేశ్వరి
ఆలయ వార్షికోత్సవాలు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 2: చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. అమ్మవారి దర్శనం కోసం హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, పక్క రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు సప్తశక్తి ఓం, అఖండ జ్యోతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు ప్రభాకర్‌శర్మ, మోతిలాల్‌శర్మ, సుబ్రహ్మణ్యంశర్మ, ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, చాముండేశ్వరీ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని
పట్టణాలకు విస్తరించాలి

■ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం

సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 2: వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, బడ్జెట్ కేటాయింపుల్లో సవతి తల్లి ప్రేమ చూపిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ కార్మిక సంఘం కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చట్టాన్ని పార్లమెంట్‌లో తీసుకురావాలన్నారు. ఉపాధి హామీ పనులను పట్టణ ప్రాంతాలకు విస్తరించి వంద రోజుల పనిని, రెండు వందల రోజులకు పెంచి రోజు కూలి రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ప్రతిపాదించిన కేంద్రం రైతు లు, పేదల పెన్షన్లు, రేషన్ దుకాణాలకిచ్చే సబ్సిడీ ఆహార ధాన్యాలను 8శాతానికి తగ్గించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో లచ్చాగౌడ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

4 శాతం రిజర్వేషన్
అమలు ఎక్కడ?

■ ఎన్‌పీఆర్డీ జిల్లా గౌరవ అధ్యక్షుడు బస్వారాజ్

సమావేశంలో మాట్లాడుతున్న బస్వారాజ్

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 2 : స్టాఫ్ నర్స్ ఉద్యోగ నియామకల్లో దివ్యాంగులకు ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందని, ధ్రువపత్రాల పరిశీలన పూర్తయినప్పటికీ అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తున్నదని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బస్వారాజు మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానలు, గురుకుల పాఠశాలలు, వివిధ ప్రభుత్వ సంస్థల్లో 7,094 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి రాత పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. అర్హత కలిగిన అనేక మంది దివ్యాంగులు పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించినా, 2016 దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రభుత్వం భర్తీ చేస్తున్న నియామకాల్లో 4శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం భర్తీ చేస్తున్న 7,094 పోస్టుల్లో 4శాతం ప్రకారం 283 పోస్టులు దివ్యాంగులతో భర్తీ చేయాల్సి ఉన్నదని, దివ్యాంగులు లేరనే కారణంగా 138 మందికి పోస్టులు భర్తీ చేస్తున్నారన్నారు. సమావేశంలో ఎన్‌పీఆర్డీ జిల్లా కార్యదర్శి యశోద, నాయకుడు గౌతమ్ ఉన్నారు.

రేపు విద్యా సదస్సు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 2: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ద్వారక గార్డెన్‌లో నిర్వహిస్తున్న జిల్లా విద్యాసదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంగయ్య, వెంకట్రాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సదస్సుకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరామ్, ప్రధాన వక్తలుగా నర్సింహారెడ్డి, వేణుగోపాల్ అతిథులుగా టీపీటీఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అశోక్‌కుమార్, నాగిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. వాల్‌పోస్టర్లను మెదక్ మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు.

బీమా చెక్కు అందజేత

కొల్చారం, ఫిబ్రవరి 2: పోతంశెట్‌పల్లి గ్రామానికి చెందిన మాసాని భీముడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు బీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకోవడంతో పార్టీ బీమా ద్వారా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఎమ్మెల్యే సునీతారెడ్డి బాధిత కుటుంబానికి ఆ చెక్కును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డమీది నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడు సమస్యలు రావొద్దు

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

■ క్షుణ్ణంగా మొదటిస్థాయి ఎఫ్‌ఎల్‌సీ పరిశీలన చేయాలి
■ కలెక్టర్ రాజర్షి షా
■ జిల్లా అధికారులతో సమీక్ష

మెదక్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): ఫస్ట్ లెవల్ చెక్అప్ మొదటి స్థాయి పరిశీలనను క్షుణ్ణంగా చేయాలని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఎఫ్‌ఎల్‌సీపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి ఎఫ్‌ఎల్‌సీ ప్రారంభమవుతుందన్నారు. ఎఫ్‌ఎల్‌సీని క్షుణ్ణంగా పరిశీలన చేయాలని, ఎఫ్‌ఎల్‌సీలో భాగంగా మాక్ పోలింగ్ నిర్వహణ, వెబ్ కాస్టింగ్ లింక్, సీసీ కెమెరాల ఏర్పాటు, హాజరు పుస్తకాల నిర్వహణ, ఆన్‌లైన్ రిపోర్ట్‌ల నిర్వహణ, సిబ్బంది గుర్తింపు కార్డ్‌లు, మౌలిక సదుపాయాల కల్పన, ఈవీఎం,వీవీ ప్యాట్, బియూ, సీయూలు ఏ మేరకు పని చేస్తున్నవి అని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, మెదక్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాసులు, మెదక్ తహశీల్దార్ శ్రీనివాస్, జిల్లా ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

బీవీఆర్‌ఐటీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

నర్సాపూర్, ఫిబ్రవరి 2 : కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల్లో సమస్యలు రాకుండా చూడాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఎన్నికల సంఘం సూచనలతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు బీవీఆర్‌ఐటీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించినట్లు కలెక్టర్ తెలిపారు. నర్సాపూర్‌లోని బీవీఆర్‌ఐటీ కళాశాలలో 5 సెగ్మెంట్లకు కౌంటింగ్ సెంటర్, ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో 2 సెగ్మెంట్లకు కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కలెక్టర్‌తో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కమలాద్రి, బీవీఆర్‌ఐటీ మేనేజర్ బాపిరాజు, గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం సాధించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

■ కలెక్టర్ రాజర్షిషా
■ టీఎన్జీవో భవన్‌లో ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 2: భవిష్యత్తుపై ప్రేరణ ఉండాలని కలెక్టర్ రాజర్షిషా విద్యార్థులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రేరణ తరగతులకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో ఉన్నతమైన సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చిందని, అన్ని రకాల పుస్తకాలతో స్టడీ మెటీరియల్స్ ఉన్నాయన్నారు. పరీక్షలు దగ్గర పడుతుండడంతో సమయాన్ని వృథా చేయొద్దని కలెక్టర్ సూచించారు. టీవీ, సెల్ ఫోన్లకు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించి సీ, డీ గ్రూపు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు క్రమశిక్షణగా ఉండేలా వార్డెన్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల్లో 260 మంది పదో తరగతి పరీక్షలకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి రాజ్‌కుమార్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు ఉన్నారు.

16న కార్మిక సంఘాల సమ్మె

■ అదనపు కలెక్టర్‌కు నోటీసు ఇచ్చిన కార్మిక నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 2: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వారాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం అదనపు కలెక్టర్ రమేశ్, జిల్లా ఐసీడీఎస్ పీడీకి జిల్లా విద్యాధికారి, డీపీవో తదితర అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా బస్వారాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్ రూ.10 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌ను, విద్యుత్తు సవరణ బిల్లు-2022ను వెనక్కి తీసుకోవాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు నెలకు రూ.7,500 జీవన భృతి చెల్లించాలన్నారు. సమ్మెలో భాగస్వాములు కావాలన్నారు. ఆయన వెంట సీఐటీయూ నాయకులు లక్ష్మి, బాలమణి, సక్కుబాయి తదితరులు ఉన్నారు.

మత్స్య సహకార సంఘం ఏర్పాటు

చేగుంట, ఫిబ్రవరి 2 : అనంతసాగర్ మత్స్య సహకార సంఘం సభ్యులకు మత్స్య శాఖ ఏడీ నియామక ప్రతాన్ని అందజేశారు. మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేయాలని కోరగా, అధికారు సొసైటీని ఏర్పాటు చేస్తూ, సంబంధించిన పత్రాలను అధ్యక్షుడు బోనగిరి నర్సింహులు శుక్రవారం ఏడీ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పిల్లి దుర్గయ్య, ప్రధాన కార్యదర్శిగా బోనగిరి భిక్షపతి, డైరెక్టర్లు చిక్కుడు స్వామి, సిద్ధిరాములు, బోయిని దశరథం, పెండల శ్రీనివాస్, సునుగురి యాదగిరి, కుక్కదుగు కిష్టయ్య ఉన్నారు.

పోలీస్ సిబ్బందికి ఫైరింగ్ శిక్షణ

శిక్షణలో భాగంగా ఫైరింగ్ చేస్తున్న ఎస్పీ బాలస్వామి

■ ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 2: జిల్లాపరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎస్పీ బాలస్వామి అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా రాజగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్ ప్రాక్టీస్ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఫైరింగ్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది అధునాతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు శిక్షణ ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

రుణాల మంజూరులో మొదటి స్థానం

■ డీఆర్డీవో శ్రీనివాస్ ■ సెర్ప్ సిబ్బందిని అభినందించిన కలెక్టర్ రాజర్షి షా

డీఆర్డీవో, సెర్ప్ సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సెర్ప్ నుంచి రూ.491.74 కోట్ల లక్ష్యానికి జనవరి నాటికి 100 శాతం పూర్తి చేసి రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉన్నదని డీఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్ ద్వారా మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు వివిధ వ్యాపారాలు ప్రారంభించేందుకు, అభివృద్ధి చేసేందుకు సెర్ప్ నుంచి 6521 లక్ష్యం నిర్దేశించగా జనవరి 30 నాటికి 100శాతం పూర్తిచేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రమేశ్, డీఆర్డీవో, అడిషనల్ డీఆర్డీవో, డీపీఎం, ఏపీఎం, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

అల్లాదుర్గం నియోజకవర్గాన్ని
ఏర్పాటు చేయాలి

అల్లాదుర్గం, ఫిబ్రవరి 2: నియోజకవర్గాల పునర్విభజనలో అల్లాదుర్గం నియోజకవర్గాన్ని చేయాలని అల్లాదుర్గం నియోజకవర్గసాధన సమితి అధ్యక్షుడు కంచరి బ్రహ్మం న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. విభజన చట్టంలో భాగంగా తెలంగాణలో అసెంబ్లీ సీట్లు పెంచుతూ 2026లో పునర్విభజన జరిగే అవకాశం ఉన్నదని, రేగోడ్, టేక్మాల్, పెద్ద శంకరంపేట మండలాలతో అల్లాదుర్గం కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు చేయాలని కోరారు.

నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట, ఫిబ్రవరి 2 : వనదుర్గా ప్రాజెక్ట్‌లో స్నానం చేయడానికి వెళ్లి నీట మునిగి ఒక యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. మెదక్ మండలం రాజ్‌పల్లికి చెందిన పల్లె శ్రీకాంత్(20) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన మిత్రుడు హరీశ్‌తో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. సాయంత్రం స్నానం చేసేందుకు వనదుర్గా ప్రాజెక్టు వద్దకు వచ్చాడు. స్నానం చేస్తున్న క్రమంలో శ్రీకాంత్ నీట మునిగిపోయాడు. దీంతో హరీశ్ స్థానికుల సహాయంతో గాలించగా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. మృతదేహాన్ని మెదక్ దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

మనోహరాబాద్, ఫిబ్రవరి 2 : పనికెళ్లొస్తానని ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని కాళ్లకల్‌లో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై తెలిపిన వివరాలు.. కాళ్లకల్ గ్రామానికి చెందిన పెద్దింటి లావణ్య మండలంలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నది. జనవరి 31న కంపెనీకి వెళ్తున్నానని చెప్పి ఇంటికి రాలేదు. లావణ్య మామ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

ఏడుపాయల్లో టెండర్ల నిర్వహణ

పాపన్నపేట, ఫిబ్రవరి 2: ఏడుపాయల్లో మహాశివరాత్రి జాతరకు సంబంధించిన సీల్డ్ టెండర్లు శుక్రవారం నిర్వహించారు. ఈ టెండర్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఆలయ చైర్మన్ బాలాగౌడ్ పర్యవేక్షణలో కొనసాగింది. ఈ టెండర్లలో తాత్కాలిక తడకల పందిర్లు ఏర్పాటు చేసేందుకు రూ.3 లక్షలకు మెదక్‌కు చెందిన సంగయ్య దక్కించుకున్నారు. టెంట్లు వంట సామగ్రి సరఫరాకు రూ. 3.33లక్షలకు మెదక్‌కు చెం దిన అంబికా టెంట్ హౌస్ శ్రీనివాస్ కైవసం చేసుకున్నారు. జాతరలో విద్యుత్ దీపాల అలంకరణకు రూ.2.30 లక్షలకు వీరభద్ర ఎల్కట్రిషన్ హైదరాబాద్ కైవసం చేసుకున్నా రు. చెప్పుల స్టాండ్ కోసం వేలం వేయగా మెదక్‌కు చెందిన అరవింద్ రూ.లక్షకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ఉన్నారు.

ప్రేమ వివాహం.. వరుడి ఇంటికి నిప్పు

దొంతి గ్రామంలో గ్రామస్తులను విచారిస్తున్న తూప్రాన్ సీఐ కృష్ణ

శివ్వంపేట, ఫిబ్రవరి 2: ఒకే గ్రామం, ఒకే కులానికి చెందిన ఓ జంట ప్రేమవివాహం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న వధువు కుటుంబ సభ్యులు కోపోద్రేకులై వరుడి ఇంటికి నిప్పు పెట్టారు. ఈ ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొంతిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలంలోని దొంతి గ్రామానికి చెందిన సోమగారి ప్రశాంత్, పిట్ల జ్యోతి కొంతకాలంగా ప్రేమించుకుని, వివాహం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న వధువు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వరుడు సోమగారి ప్రశాంత్ ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో డిజిల్ పోసి నిప్పు పెట్టారు. దీంతో ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయాలి. దీంతోపాటు గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు మొత్తం దగ్ధమైంది. సమాచారం అందుకున్న తూప్రాన్ సీఐ కృష్ణ, ఎస్సై రవికాంత్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వరుడి తల్లి సోమగారి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికాంత్‌రావు తెలిపారు.

అదుపుతప్పిన బైక్.. ఇద్దరు మృతి

కొల్చారం, ఫిబ్రవరి 2 : మోటర్ సైకిల్ అదుపు తప్పి నేషనల్ హైవే పక్కన ఉన్న ఇనుప జాలిని ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొల్చారం గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు సభ్యులు మహ్మద్ (38), బేకరీలో కూలీగా పని చేస్తున్న ఆరిఫ్ (55) మోటర్ సైకిల్‌పై కౌడిపల్లి వైపు నుంచి కొల్చారం వస్తుండగా, మార్గమధ్యంలో లోతు వాగు సమీపంలోని మూలమలుపు వద్ద రోడ్డు పక్క ఇనుపజాలిని ఢీకొట్టారు. తలకు బలమైన గాయాలు కావడంతో ఆరిఫ్ అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహ్మద్‌ను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మెదక్‌లో ఏరియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించడంతో మహ్మద్ మృతి చెందాడు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మృతదేహాలకు ఎస్సై మహ్మద్ గౌస్ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం కోసం మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నేడు మంత్రి పర్యటన

రేగోడ్, ఫిబ్రవరి 2: వైద్యారోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ మండలంలో పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దిగంబర్‌రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. లింగంపల్లి, పోచారం, ప్యారారం, మర్పల్లి, రేగోడ్, కొండాపూర్, జగిర్యాల, ఇటిక్యాల్(ఆర్) తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనున్నారని పేర్కొన్నారు. మంత్రి పర్యటనలో కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

మీసేవ, ఆధార్ సెంటర్లలో
అధికారుల తనిఖీ

రేగోడ్, ఫిబ్రవరి 2: మండలంలోని మీసేవ, ఆధార్ సెంటర్లను శుక్రవారం జిల్లా మేనేజర్ శశికాంత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు సమయ పాలన పాటించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులకు హెచ్చరించారు. జిల్లా మేనేజర్ రాజు, నిర్వాహకులు సంతోష్, గోవింద్ తదితరులు ఉన్నారు.

7న జాతీయ సైన్స్ పోటీలు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 2: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఆదేశాలతో విద్యార్థులకు ప్రతిభా పోటీలను పాఠశాల, మండల, జిల్లాస్థాయిలో నిర్వహించాలని డీఈవో రాధాకిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 7న ప్రతి పాఠశాలలో, 12న జిల్లాస్థాయి పోటీలు జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి (8328599157) సంప్రదించాలన్నారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్

రామాయంపేటలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇంటర్ బోర్డు అధికారి సత్యనారాయణ

■ జిల్లా వ్యాప్తంగా జనరల్‌లో 3594 మంది, ఒకేషనల్‌లో 1130 మంది విద్యార్థుల హాజరు
■ 35 కేంద్రాల్లో పరీక్షలు

రామాయంపేట/మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 2: మెదక్ జిల్లావ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ బోర్డు విద్యాశాఖ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రెండో రోజు రామాయంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ప్రాక్టికల్స్‌ను పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా జనరల్‌లో 3594 మంది, ఒకేషనల్‌లో 1130 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరవుతున్నారన్నారు. జిల్లాలో 35 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఆయన వెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

'పోస్టల్' ఇన్సూరెన్స్‌తో భరోసా

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 2 : తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి సబ్ డివిజన్ తపాలా శాఖ మెయిల్ ఓవర్సీస్ అధికారి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం పోస్టాపీస్ కార్యాలయంలో పెద్దశంకరంపేట తపాలా శాఖకు వచ్చిన ఖాతాదారులకు లాభాదాయకమైన పోస్టల్ పథకాలపై ఆయన అవగాహన కల్పించారు. తపాలా శాఖ ప్రవేశపెట్టిన పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తపాలాశాఖ బీమా పాలసీలు పెంచేందుకు బీపీఎంలు, సిబ్బంది కృషి చేయాలన్నారు. జీవిత బీమా వివరాలను ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించి పాలసీలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పేట ఎస్‌పీఎం రఘు, బీపీఎంలు రఘు, ప్రశాంత్, గంగారాం, మాణయ్య, సిబ్బంది తుకారాం, సుదర్శన్, సవిత తదితరులు ఉన్నారు.

పని చేసేవారికే గుర్తింపు

■ ప్రభుత్వ దవాఖానలను స్వచ్ఛతగా ఉంచాలి
■ కాయకల్ప జిల్లా బృందం
■ రామాయంపేట దవాఖానలో అధికార బృందం తనిఖీ

దవాఖానలో హెర్బల్ పార్కును పరిశీలిస్తున్న టీం బృందం సభ్యులు

రామాయంపేట, ఫిబ్రవరి 2: దవాఖానలో పేషంట్లకు మెరుగైన సేవలు అందించినప్పుడే పని చేసే సిబ్బందికి పేరు ప్రతిష్టలు దక్కుతాయని మెదక్ జిల్లా కాయకల్ప టీం లీడర్ డాక్టర్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రామాయంపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. దవాఖానలో పరిసరాలను పరిశీలించి పేషంట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పేషంట్లకు అందుతున్న సేవలు బాగున్నాయని, దవాఖానలోని ల్యాబ్, పోస్టుమార్టం గది, అవుట్ పేషంట్ల చికిత్సలు, హెర్బల్ గార్డెన్ తదితర గదులను సందర్శించి, సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయంపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం స్వచ్ఛతగా ఉందన్నారు. దవాఖానను పరిశుభ్రంగా ఉంచడం బాగుందన్నారు. దవాఖానలో వందలాది పేషంట్లు రావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. దవాఖాన ముందే హెర్బల్ పార్కు నిర్మించి అందులో ఔషధ మొక్కలు నాటడం సంతోషకరమన్నారు. ఇదే సంకల్పంతో సిబ్బంది ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో దవాఖాన వైద్యులు రామాయంపేట, తూప్రాన్ సూపరింటెండెంట్లు డాక్టర్ లింబాద్రి, అమర్‌సింగ్, చిల్డ్రన్ డాక్టర్ ప్రదీప్, సుకేషిని, వైద్యశాల సిబ్బంది లక్ష్మణ్ నాయక్, నాగరాజు, నర్సులు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచ్ కీలకం

నర్సాపూర్ : పెద్దచింతకుంట పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రామాయంపేట/ నిజాంపేట/ నర్సాపూర్, ఫిబ్రవరి 2 : గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు విశిష్ట సేవలు అందించారని రామాయంపేట ఎంపీపీ నార్సింపేట భిక్షపతి, ఎంపీడీవో ఉమాదేవి పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో శుక్రవారం సర్పంచ్‌లకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. 15 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ స్రవంతీసిద్ధిరాంరెడ్డి, ఏవో రాజ్‌నారాయణ, ఏఈ కుషాల్, ఎంపీవో గిరిజారాణి, ఎంపీటీసీలు మల్లన్నగారి నాగులు, జ్యోతి, మాజీ సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరయ్యారు.

చల్మెడ పాలకవర్గ సభ్యులకు సన్మానం

నిజాంపేట మండలంలోని చల్మెడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గం సభ్యులకు శుక్రవారం సన్మానించినట్లు కార్యదర్శి తెలిపారు. సర్పంచ్ నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ రమేశ్, వార్డు సభ్యులకు పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి, గ్రామ స్థాయి అధికారులు శాలువా కప్పి మెమొంటోలు బహూకరించారు. కార్యక్రమంలో చల్మెడ గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో జగదీశ్వర్‌చారి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దచింతకుంట పాలకవర్గానికి సన్మానం

నర్సాపూర్ మండలంలో పెద్దచింతకుంట గ్రామపంచాయతీ పాలక మండలి కాలపరిమితి ముగియడంతో పాలకవర్గాన్ని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివకుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శేఖర్, బాలమణి, నాగభూషణం, మాజీ ఉపసర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.

రామాయంపేట మండల సర్పంచ్‌లను సన్మానించిన అధికారులు

నిజాంపేట : చల్మెడలో పంచాయతీ పాలకవర్గం సభ్యులకు సన్మానం